

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు వెంకట్

## ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను గెలిపించాలి

- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు వెంకట్

అర్వపల్లి, నవంబర్ 25 : ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను గెలిపించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు గుంగాదరి వెంకట్ కోరారు. శనివారం అర్వపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న అభ్యర్థి ఏనాడు మాదిగల కోసం పాటుపడలేదన్నారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ గెలుపు కోసం బీఆర్ఎస్వీ నాయకులు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డం వెంకన్న, భిక్షం, బాలస్వామి, ప్రవీణ్, శైలేందర్, నవీన్, అంజి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్‌లో బాల సభ

తిరుమలగిరి, నవంబర్ 25 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు బాల సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తలెత్తే ప్రమాదాలు, బృణహత్యలు తదితర అంశాలపై విద్యార్థులే వ్యాఖ్యాతలుగా వ్యవహరించి అవగాహన కల్పించారు. అలాగే పలు సమాజిక అంశాలపై అవగాహన కల్పించేలా నాటికలు ప్రదర్శించారు.

# పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

## కాంగ్రెస్ కరెంట్ ఇవ్వదు.. రైతు బంధు ఇవ్వదు

### ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

### నూతనకల్‌లో ఎన్నికల ప్రచారం

నూతనకల్, అక్టోబర్ 20 : బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడిందని.. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్ఎస్ తుంగతుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే 24 గంటల కరెంట్ ఇవ్వరని, రైతు బంధు బంద్ చేస్తారని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సీఎం కేసీఆర్‌ను మరిచి పోవద్దని సూచించారు. తనను మరోమారు గెలిపిస్తే నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. ప్రసుత్తం రైతులకు ఎకరానికి రూ.10 వేలు ఇస్తుండుగా నూతన మ్యానిఫెస్టో ప్రకారం రూ.16 వేలు అందివ్వనున్నట్లు తెలిపారు. అలాగే కల్యాణలక్ష్మి పథకం కింద రూ.2 లక్షలు, రూ.400కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్య లక్ష్మి పథకం కింద ప్రతి పేద మహిళకు రూ.3 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే ప్రచార రథంలో మండల కేంద్రానికి రాగా బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీగా ఆయన వెంట వచ్చారు. డప్పులు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతీసంజీవరెడ్డి, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చూడి లింగారెడ్డి, బత్తుల సాయిల్‌గౌడ్, బద్దం ప్రశాంత్‌రెడ్డి, మొగుళ్ల వెంకన్న, బత్తిని లింగయ్య, ఇరుగు మధు, నకిరేకంటి వెంకన్న, వెంకట్‌రెడ్డి, వీరూయాదవ్, వీరమల్ల యాదగిరి, బత్తుల విజయ్‌కుమార్, బత్తుల విద్యాసాగర్, సైదిరెడ్డి పాల్గొన్నారు.



నూతనకల్ ప్రచారంలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

### అభివృద్ధికి అండగా బీఆర్ఎస్‌లో చేరికలు : ఎమ్మెల్యే కిశోర్

తిరుమలగిరి, నవంబర్ 25 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై అండగా ఉండేందుకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తెలిపారు. మండలంలోని మామిడాల పంచాయతీకి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కృష్ణ, మహేశ్, మల్లయ్య, లింగయ్య, భిక్షం, నరేశ్‌తో పాటు పలువురు నాయకులు తిరుమలగిరిలోని నివాసంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీశ్ పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు



తిరుమలగిరిలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు



మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో డమ్మీ ఈవీఎం ద్వారా కారు గుర్తుపై అవగాహన కల్పిస్తున్న వెంకటయ్య

# కారుకు ఓటేసి అభివృద్ధికి పట్టం కట్టండి

మోత్కూరు, నవంబర్ 25 : అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పాటు పడే బీఆర్ఎస్‌ను ఆదరించి కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను అశీర్వదించాలని మోత్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య ప్రజలను కోరారు. శనివారం మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండాపురం, జామచెట్లబావిలో బీఆర్ఎస్ నాయకుడు తీపిరెడ్డి మేఘారెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దబ్బెటి విజయారమేశ్, బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, పురుగుల వెంకన్న, నాయకులు లక్ష్మయ్య, అనిత, అరుణ, భిక్షపతి పాల్గొన్నారు.

అడ్డగూడూరు : ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు అడ్డగూడూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడకాల రణధీర్‌రెడ్డి, నాయకులు సోమిరెడ్డి పురుషోత్తంరెడ్డి, బైరెడ్డి నర్సిరెడ్డి, నీరటి పరశురాములు. అబ్బయ్య, లోకేశ్, లక్ష్మి, బువ్వమ్మ పాల్గొన్నారు.



అడ్డగూడూరులో డమ్మీ ఈవీఎం ద్వారా కారు గుర్తుపై అవగాహన కల్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రైతు బంధు సాయం@13వేల కోట్లు

- 12వ సారి పంపిణీకి రంగం సిద్ధం
- పెట్టుబడి సాయానికి అనుమతించిన ఎలక్షన్ కమిషన్
- రైతాంగంలో హర్షాతిరేకాలు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కునారిల్లిన వ్యవసాయాన్ని గాడిలో పెట్టేందుకు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. ఇక వీటికి తోడు రైతన్నను సాగుమడిలో ముందుకు నడిపించేందుకు పెట్టుబడి సాయం కోసం ఆలోచించారు. దానికి రైతుబంధు అని పేరు పెట్టి 2018 వానాకాలం సీజన్ నుంచి ఎకరానికి నాలుగు వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు పెట్టుబడి సాయం అందించడం మొదలుపెట్టారు. 2018 డిసెంబర్‌లో రెండోసారి అధికారంలోకి రాగానే వానాకాలం నుంచి ఎకరానికి ఐదు వేల చొప్పున ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి 10వేల రూపాయల సాయాన్ని అందిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నడూ కూడా రైతుబంధు ఆగలేదు. సీజన్ ప్రారంభం అవుతుందంటే చాలూ... పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు బదిలీ చేస్తున్నారు. ఇలా వానాకాలంలో జూన్, జూలైల్లో, యాసంగిలో నవంబర్, డిసెంబర్ మాసాల్లో క్రమం తప్పకుండా రైతు బంధు డబ్బులు ఒక్క పైసా లంచం లేకుండా రైతులకే చెందుతున్నాయి. సీజన్ సీజన్‌కు కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులకు సైతం పెట్టుబడి సాయం అందజేస్తున్నారు. ప్రస్తుత యా సంగి సీజన్‌లో సైతం రైతుబంధు డబ్బులు పంపిణీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఎన్నికల పేరుతో రైతు వ్యవసాయం ఆగద్దని ప్రత్యేకంగా ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసి అనుమతి సాధించింది.

### ఎల్లుండి నుంచి షురూ...

ఎన్నికల సంఘం అనుమతించినా ఇవ్వాళ, రేపు ప్రభుత్వ సెలవు దినాలు ఉండడంతో పంపణీకి ఆటంకంగా మారింది. దీంతో మంగళవారం నుంచి రైతుబంధు డబ్బుల పంపిణీ షురూ కానుంది. ఎప్పటిలాగే రైతుల ఖాతాల్లో తొలిరోజూ ఎకరం నుంచి మొదలుకుని భూవిస్తీర్ణంతో సంబంధం లేకుండా దశలవారీగా వారం పది రోజుల్లో రైతులందరికీ రైతుబంధు నగదు జమకానుంది. తొలి రోజూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 3.20లక్షల మంది రైతులకు సంబంధించిన రెండు లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయంగా సుమారు రూ.100కోట్ల వరకు రైతులకు అందనున్నట్లు అంచనా.

ఇలా భూవిస్తీర్ణంతో సంబంధం లేకుం డా పట్టాదారు పాసుపుస్తకం ఉన్న చివరి రైతు వరకు రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమకానున్నాయి. ఇక మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రైతుబంధు సాయం దశలవారీగా ఏడాదికి 16వేల రూపాయలకు పెంచనున్నట్లు ఇప్పటికే కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

### 12 విడతల్లో రూ.13000 కోట్లు

రాష్ట్రంలోనే రైతుబంధు ద్వారా అత్యధిక ప్రయోజనం పొందే జిల్లా ఉమ్మడి నల్లగొండనే. సీజన్ సీజన్‌కు ఈ సంఖ్య భారీగా పెరుగుతూ వస్తోంది. పథకం ప్రారంభం అయిన నాటి నుంచి మొత్తం 11 సీజన్లలో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం రూ.11,700 కోట్ల వరకు రైతులకు పెట్టుబడి సాయంగా అందింది. ప్రస్తుత యాసంగిలో మరో 1300 కోట్ల రూపాయలు రైతులకు చేరనున్నాయి. మొత్తంగా 12 విడతల్లో కలిపి సుమారు 13వేల కోట్ల రూపాయలు ఉమ్మడి జిల్లా రైతాంగానికి చెందనున్నాయి. ఇన్ని కోట్ల రూపాయల్లోనే ఒక్క రూపాయి పక్కదారి పట్టకుండా ప్రతీ పైసా నేరుగా రైతుకే చెందేలా అత్యంత పకడ్బందీగా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఒక్క రూపాయి కూడా ఎవ్వరికీ లంచం ఇవ్వకుండా నేరుగా రైతులకే చెందుతున్నాయంటే అందుకు ప్రభుత్వం పాటిస్తున్న పారదర్శకత, చిత్తశుద్ధినే కారణం. గతంలో సమైఖ్య పాలనలో ఏ ప్రభుత్వ పథకంలోనైనా 20 నుంచి 30శాతం వరకు నిధులు దళారుల, అక్రమార్కుల జేబుల్లోకే చేరేవన్నది కాదనలేని సత్యం.

### 11లక్షల మందికి రూ.1300 కోట్లు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 11లక్షల మంది పైచిలుకు రైతులకు ప్రస్తుత యాసంగిలో పెట్టుబడి సాయం అందనుంది. పెట్టుబడి సాయంగా మొత్తం 1300కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. 2022 యాసంగిలో పెట్టుబడి సాయం పొందిన రైతుల సంఖ్య 10.81లక్షలుగా ఉంది. ఈ ఏడాది వానాకాలంలో అది 11 లక్షల దరిదాపుల్లోకి చేరింది. ప్రస్తుతం సీజన్‌లో రైతుల సంఖ్య 11 లక్షలు దాటనుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. నల్లగొండ జిల్లాలో 5.30 లక్షలు, సూర్యాపేట జిల్లాలో 3.10లక్షలు, యాదాద్రి జిల్లాలో 2.71లక్షల మంది రైతులు అర్హులుగా అంచనా. ఈ సీజన్‌లో పోడు రైతులతో పాటు కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతుల వివరాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. వీరికి కూడా ఈ ధపాలో రైతుబంధు అందించనున్నారు.